క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వీఆర్‌ఓలు

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల సమయంలో చిత్తూరు జిల్లా నుంచి తహసీల్దార్ జయప్రకాష్ బదిలీపై కోవెలకుంట్లకు వచ్చారు. తిరిగి సొంత జిల్లాకు రిపోర్ట్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో శనివారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఐదు నెలల పాటు కోవెలకుంట్ల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించి సొంత జిల్లాకు వెళుతున్న జయప్రకాష్‌ను కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ ఇమ్రాన్, సీనియర్ అసిస్టెంట్ రాంనాథరెడ్డి, వీఆర్‌ఓలు చెన్నయ్య, పుల్లయ్య, బాలమద్దిలేటి, సుబ్రమణ్యం, రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ



సారె, ఒడి బియ్యంతో ఆలయానికి వస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కోవెలకుంట్ల: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మారెమ్మ అమ్మవారికి శనివారం ఆర్యవైశ్య మహిళలు చీర, సారె, ఒడి బియ్యం సమర్పించారు. స్థానిక అమ్మవారిశాల నుంచి మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మారెమ్మ ప్రతిమను అందించిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, విజయలక్ష్మి దంపతులు, వందనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న కేవీకే శాస్త్రవేత్త, ఎంఈఓ

బనగానపల్లెరూరల్: మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త లక్ష్మీప్రియ, ఎంఈఓ స్వరూప అన్నారు. స్థానిక జెడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పాఠశాలలో ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథులుగా లక్ష్మీప్రియ, స్వరూప మాట్లాడుతూ.. సప్తాహ్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: రక్తదానం చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతున్న యువత సేవలు స్ఫూర్తిదాయకం అని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ఆర్థోపెడిక్ వైద్యుడు వెంకటరమణ అన్నారు. కొత్త బస్టాండ్ సమీపంలోని ఆరోగ్య మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని కర్నూలుకు చెందిన ఆర్‌ఆర్ రక్త నిధి కేంద్రానికి అందించారు. రక్త దాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సీసంగుంతల మధు, సభ్యులను అభినందించారు.

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న జేసీ



జేసీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవిని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ గోపురం వద్ద అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు చేయించి తీర్థప్రసాదాలతో సత్కరించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రాఘువేంద్ర ఉన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

- విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ప్యాపిలి: పేదరికం నుంచి బయటపడాలన్నా.. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్న విద్యతో సాధ్యమవుతుందని.. బాలికలు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కష్టపడి చదవాలన్నారు. సరైన ప్రణాళికతో చదివితే ఎంత కష్టమైన లక్ష్యాన్నైనా సునాయసంగా సాధించవచ్చని తెలిపారు. అనవసరమైన విషయాల గురించి ఆలోచిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకోరాదన్నారు. మొబైల్‌లో విజ్ఞానానికి సంబంధించిన విషయాలను ఒక పరిమిత సమయం వరకు మాత్రమే చూడాలన్నారు. బాలికల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని వాటి గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, న్యాయవాది వెంకటేశ్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నవీనపాటి, అధ్యాపకులు రామకృష్ణయ్య, నవీన్, సత్యబాబు, వెంకటరమణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

డోన్ టౌన్: ఇటీవల అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక కోర్టు సముదాయాల ఆవరణలో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయ కళాశాల అధ్యాపకుడు లక్ష్మీశెట్టి సాయిచందన్‌తో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతి, డోన్ బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చిన్న కేసులకు పెద్ద శిక్షలు



మాట్లాడుతున్న సీఐ గోపినాథ్‌రెడ్డి

కొలిమిగుండ్ల: కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాల ద్వారా చిన్న కేసుల్లో సైతం జైలుకు వెళ్లాల్సి వస్తుందని సీఐ గోపీనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో లాయర్ దస్తగిరితో కలిసి నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), సీఆర్‌పీసీ 1973 స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) చట్టాలుగా మారాయన్నారు. జూలై 1నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. నూతన చట్టంలో ఈ-ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్‌కు చోటు లభించిందని చెప్పారు. కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణ చేసే అవకాశం చట్టంలో కల్పించారని పేర్కొన్నారు. ఫోన్‌లో దూషించినా, ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసినా కఠినమైన శిక్షలు తప్పవన్నారు. మహిళలపై జరిగే దాడులు, లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై సకాలంలో శిక్షలు పడుతాయన్నారు. బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా మార్పులు తీసుకొచ్చారని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదుకు అవకాశం కల్పించినా మూడు రోజుల్లో ఫిర్యాదుదారుడు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. బాధితులు అందుబాటులో ఉన్న ఏ పోలీస్‌స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారన్నారు.

జీవాల్లో వ్యాధులపై అప్రమత్తత అవసరం



సూచనలు చేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ

కోవెలకుంట్ల: పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ కేవీబ్రహ్మం సూచించారు. శనివారం పట్టణంలోని పశువైద్యశాలలో కోవెలకుంట్ల, గోస్పాడు మండలాల పశువైద్యాధికారులు, పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో పశువులకు గొంతు, పాదుగువాపు, తదితర వ్యాధులు సోకే అస్కారం ఉందన్నారు. అలాగే మేకలు, గొర్రెలకు నీలినాలుక వ్యాధి ప్రబలకుండా ముందస్తు టీకాలు వేయించాలని తెలిపారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని పశువైద్యశాలలకు తోలుకొచ్చి చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. పశువైద్యాధికారులు కృష్ణకుమార్, విజయలక్ష్మి, ఉమాదేవి, అవినాష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాహసం చేయాల్సిందే..!



గాల్లో తేలియాడుతున్న ట్రాక్టర్ ఇంజిన్ భాగం

కొలిమిగుండ్ల: నాపరాళ్లను రవాణ చేసే ట్రాక్టర్ డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో ప్రతి రోజు సాహసం చేయాల్సిందే. మండలంలో నాపరాతి గనులు అధికంగా ఉన్నాయి. ఈ పరిశ్రమపై వందలాది కార్మిక కుటుంబాలు ఆధారపడ్డాయి. గనుల్లో వెలికి తీసిన నాపరాళ్లను ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు చేరవేస్తుంటారు. గనుల వద్ద రాళ్లను లోడ్ చేసుకున్నాక ప్రధాన రహదారిపైకి రావాలంటే కత్తిమీద సాములాగా ఉంటుంది. కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె సమీపంలోని ప్రధాన రహదారిపై ఎత్తు పల్లాలుగా ఉండడంతో ట్రాక్టర్ ఇంజిన్ భాగం గాల్లో తేలాడుతూ ఉంటుంది. ఈ దృశ్యాలు చూపురులనే భయభ్రాంతులకు గురి చేస్తుంటాయి. ఏ మాత్రం అదుపుతప్పినా డ్రైవర్లు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రమాదమని తెలిసినా కుటుంబ పోషణ కోసం డ్రైవర్లు ఈ వృత్తిలో కొనసాగాల్సి వస్తోంది.

వ్యాధుల కాలం.. జాగ్రత్తలు పాటించాలి



15వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

డోన్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని.. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర జయరాం అన్నారు. శనివారం స్థానిక 15వ వార్డులో మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానికులతో మాట్లాడుతూ.. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నిల్వ చేరడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని పేర్కొన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తలను వేరు చేసి సిబ్బందికి అందజేయాలన్నారు. స్టాప్ డయేరియాలో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలకు ప్రభుత్వం అందించే జింక్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని వైద్య సిబ్బంది అందజేయాలని సూచించారు.

మందుబాబుల వీరంగం

- చోద్యం చూసిన పోలీసులు



వినాయకగుడి సమీపంలో ఘర్షణ పడుతున్న మందుబాబులు

డోన్: పట్టణంలో గంజాయి, మద్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దీంతో కొందరు తరచూ మద్యం, గంజాయి సేవించి రోడ్లపై వీరంగం సృష్టిస్తున్నారు. పోలీసు అధికారులు బదిలీపై వెళ్తున్నాం మాకెందుకులే అనే నిర్లిప్తతతో ఉండడంతో పట్టణంలో శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయి. కొందరు టీడీపీ నాయకులు కర్ణాటక, తెలంగాణ మద్యంతో పాటు గంజాయిని కిరాణా సరుకుల్లా విక్రయిస్తుండడంతో యువత మత్తుకు బానిసవుతోంది. తప్పతాగి నిత్యం ఏదో ఒక చోట గొడవలకు దిగుతున్నారు. చిగురుమానుపేట, తారకరామనగర్, పాతపేట ప్రాంతాల్లో పలువురు గాయపడినా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు కేసులు నమోదు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శనివారం స్థానిక వినాయకగుడి వద్ద మద్యం సేవించిన యువకులు పరస్పరం దాడులకు దిగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమీపంలోనే ట్రాఫిక్ పోలీసులు ఉన్నా చోద్యం చూస్తున్నారే తప్ప ఘర్షణ పడుతున్న యువకులను అదుపు చేయలేదు. ఎవరిని పట్టుకుంటే అధికార పార్టీ నాయకునితో మాటలు అనిపించుకోవాల్సి వస్తుందని మిన్నకుండిపోయారు.

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి



పాత బస్టాండ్‌లో గస్తీని పరిశీలిస్తున్న సీఐ

డోన్ టౌన్: తల్లిదండ్రులు వారి పిల్లల కదలికలపై నిఘా ఉంచాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలో కొందరు యువకులు ఘర్షణ పడడంపై స్పందించారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలు చెడు మార్గాల్లో వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై ఉందన్నారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన గస్తీని పరిశీలించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బేతంచెర్ల: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేష్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) కోర్సులో ఎస్టీ-2, బీసీ(బీ)-2, బీసీ(డీ)-1, ఈసీఈలో ఎస్టీ-1, బీసీ(ఏ)-1, ఈడబ్ల్యుఎస్-1, ఈఈఈ కోర్సులో 25 సీట్లు, మెకానికల్‌లో 48 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. పాలిసెట్-2024 రాసిన విద్యార్థులతో పాటు పది పాస్ అయ్యి ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో దరఖాస్తు ఫారాన్ని తీసుకుని పూర్తి చేసిన ఫారాన్ని ఈ నెల 30వ తేదీ 5 గంటల్లోగా కళాశాలలో అందజేయాలని తెలిపారు. ఈ నెల 31వ లేదీ స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9959931461 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ



ప్రయాణికునికి నగదు, వస్తువులను అందజేస్తున్న డీఎం

డోన్ టౌన్: ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడో ఆర్టీసీ డ్రైవర్. వివరాలు.. శుక్రవారం రాత్రి విజయవాడలో బయలు దేరి శనివారం ఉదయం డోన్‌కు చేరుకున్న ఆర్టీసీ బస్సులో బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్ కుమార్ కర్నూలు వరకు ప్రయాణించాడు. కర్నూలులో దిగిపోయిన సమయంలో తన పర్సును పోగొట్టుకున్నట్లు గుర్తించాడు. విషయాన్ని విచారణ కేంద్రంలోని కంట్రోలర్ సురేష్ దృష్టికి తీసుకెళ్లాడు. అతను డ్రైవర్ విక్టర్‌కు కాల్ చేశాడు. విక్టర్ ప్రయాణికుడు కుర్చున్న సీటు వద్దకు వెళ్లి చూడగా పర్సు సీటు కిందపడి ఉంది. అందులో రూ.12 వేల నగదు, ఏటీఎం కార్డులు, ఆధార్, పాన్ కార్డులు ఉన్నట్లు గుర్తించాడు. డోన్ డిపోకు చేరుకున్న వెంటనే వాటిని సెక్యూరిటీ సిబ్బందికి అందజేశాడు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ శశిభూషణ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రయాణికుడిని డోన్‌కు పిలిపించి పర్సును అప్పగించాడు. నిజాయితీ చాటుకున్న డ్రైవర్ విక్టర్‌ను అభినందించారు.

స్పర్శలేని మచ్చలు కుష్టుకు సంకేతం



స్పర్శలేని మచ్చలను గుర్తిస్తున్న డాక్టర్

కోవెలకుంట్ల: శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే అవి కుష్టుకు సంకేతమని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విద్యాసాగర్, మహబూబ్ సుభాని అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ఎం. గోవిందిన్నె గ్రామంలో స్పర్శలేని మచ్చలపై శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులకు ఆరు నెలల నుంచి ఏడాది వరకు ఉచితంగా వైద్య చికిత్సలు అందజేస్తామన్నారు. వ్యాధి నివారణకు కావాల్సిన మందులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ దామోదర్, హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్: ఇటీవల అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష్యా అధినీయం చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బనగానపల్లె సీఐ గంటాసుబ్బారావు అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కొత్త చట్టాలపై వివిధ ప్రజా సంఘాలు, ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నూతనంగా తీసుకొచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దుకాణ యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని.. తద్వారా చోరీలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.

పట్టుదలతో చదివితే విజయం సొంతం

విద్యార్థులు, పట్టుదల క్రమశిక్షణతో చదివితే తప్పకుండా విజయం వరిస్తుందని నందివర్గం ఎస్‌ఐ తిరుపాల్ సూచించారు. శనివారం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటికి భానిసైతే విద్యలో వెనుకబడుతారన్నారు. కేవలం చదువుపైనే ధ్యాస ఉంచాలని హితవుపలికారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం నారాయణ, పీఈటీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు, నాగలింగమయ్య, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే సమస్యలకు పరిష్కారం

- సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామరెడ్డి
- గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చిన సర్పంచ్‌లు



వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణాపురం సర్పంచ్

ప్యాపిలి: మండల స్థాయి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తే క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గోకుల్ లక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు సమర్పించారు. సర్పంచ్ తమ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. సచివాలయాల్లో పని చేస్తున్న అధికారులు తప్పనిసరిగా తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సమస్య తీవ్రంగా ఉంటే ఆ సమస్యను ఉన్నతాధికారులు, జెడ్పీటీసీ, ఎంపీపీ దృష్టికి తీసుకురావాలన్నారు. విధులపై అధికారులు అలసత్వం వహిస్తే ఆ ప్రభావం కింది స్థాయి ఉద్యోగులపై పడుతుందన్నారు. ఫలితంగా సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సాయిమనోహర్, డీటీ మారుతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దిలీప్ చక్రవర్తి, మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ రసూల్, ఏనుగుమర్రి సర్పంచ్ కరణం మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించండి

మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్ ధనుంజయశెట్టి సర్వసభ్య సమావేశంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పంచాయతీ భవనం, గ్రామైక్య సంఘానికి భవనం మంజూరు చేయాలని కోరారు. గ్రామం వద్ద జుర్రేరు వాగుపై బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

సామాజిక బాధ్యత అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 రామనర్సప్ప

డోన్ టౌన్: విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి-2 రామనర్సప్ప అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. విద్యార్థులతో ఈకో క్లబ్ ఏర్పాటు చేయించారు. ఇందులో సభ్యులు వాటర్ మేనేజ్‌మెంట్, పరిసరాల పరిశుభ్రత, మొక్కల సంరక్షణ వంటి పనులు చేసేలా సామాజిక బాధ్యత నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

నగదు ప్రోత్సాహం:

2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి గణిత పరీక్షలో వంద మార్కులు సాధించిన ఉదయ్ కుమార్, భరత్‌తో పాటు గణిత ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరెడ్డి, సురేష్‌కు ఎంఈఓ రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. గణిత ఉపాధ్యాయుడు సురేష్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.500 చొప్పున విద్యార్థులకు అందజేశారు. అలాగే తెలుగు ఉపాధ్యాయురాలు లీలావతమ్మ తెలుగు సబ్జెక్టులో 99 మార్కులు సాధించిన ఉదయ్‌కుమార్‌కు రూ.వెయ్యి అందజేశారు. చదువులో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని.. ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణలపై సమీక్ష



సర్వేయర్లతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

బనగానపల్లెరూరల్: గత ప్రభుత్వ హయాంలో బనగానపల్లె మండలంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలపై డోన్ ఆర్డీఓ మహేశ్వరరెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో గత ప్రభుత్వం ఎంత మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది?.. వాటిలో ఎంత మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించారు? తదితర వివరాలపై ఆరా తీశారు. ఇళ్లు మంజూరు కాకుంటే వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లు మంజూరై పనులు ప్రారంభించకుంటే వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వీఆర్వోలు, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తెలిపారు. సమావేశంలో మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రాఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



బోయ శశికళ (ఫైల్)

బేతంచెర్ల: ట్రాక్టర్ పైనుంచి కిందపడడం.. అదే సమయంలో వెనుక చక్రాలు ఎక్కడంతో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని బలపాలపల్లె-పాపసాని కొట్టాల మార్గంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. బేతంచెర్ల మండలం పాపసాని కొట్టాల గ్రామానికి చెందిన బోయ మధు భార్య శశికళ, చిన్న కొడుకు మనోజ్‌తో కలిసి బలపాలపల్లె గ్రామానికి పని నిమిత్తం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో నాపరాళ్ల లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చొంది. పాపసాని కొట్టాల కనుమ వద్ద అదుపు తప్పి ట్రాక్టర్ పైనుంచి కింద పడింది. వెనుక టైరు ఎక్కడంతో శశికళ(30) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు ఉన్న చిన్న కుమారుడు మనోజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని తాటిమాన్‌కొత్తూరు గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోగోలు గ్రామానికి చెందిన ఎల్లేష్ గాయపడ్డాడు. డోన్ నుంచి సొంతూరు బోగోలుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అతన్ని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.